కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# ఆత్మకథ

ఆత్మకథ అనగానే సాధారణంగా ఎవరి ఆత్మకథ? అనే ప్రశ్న ఉదయిస్తుంది ప్రతి మనిషి మదిలో. ఇది మనందరీ ఆత్మకథ. మహిలోని మానవులందరీ ఆత్మకథ. బ్రతికున్నవారి ఆత్మకథ, చనిపోయినవారి ఆత్మకథ. మన దేహంలోని ఆత్మకథ.

చనిపోయినవారి దేహాల్లో కూడా ఆత్మ ఉంటుంది. ఆ సంగతి ఇహలోక వాసులకు అర్థం కాదు. మృతులకు మాత్రమే తెలుస్తుంది. అసలు ఆత్మ అంటే ఏమిటో మనకెవరికీ తెలియదు. ఆత్మలు సృష్టించిన శక్తిస్వరూపుడికే తెలుసు. కనుక ఆ సృష్టికర్త ఆత్మను గురించి మానవులకు ఏం తెలియజేశాడో మనమిక్కడ వివరంగా తెలుసుకుందాం.

ఆత్మ అంటే ఏమిటి, ఎలా ఉంటుంది, అది దేహంలోకి ఎలా వస్తుంది, ఎలా మళ్ళీ బయటికి పోతుంది? అనే ప్రశ్నలకు ఈనాటికీ తృప్తికరమైన సమాధానాలు లభించలేదు. లభించే అవకాశాలు కూడా కన్పించడం లేదు. కారణం ఆత్మను గురించి అర్థం చేసుకోవడం మానవ మేధకు అతీతమైన విషయం.

అంతిమ దైవగ్రంథం ఖుర్ఆన్ ఆత్మను గురించి ప్రజలు అడిగిన ప్రశ్నకు సృష్టికర్త మౌలిక సమాధానంగా ఇలా తెలియజేశాడు:

"వారు ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. 'ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. (దీన్ని మీరు గ్రహించలేరని,) మీకు పరిమిత జ్ఞానం ప్రసాదించ బడింద'ని చెప్పు." (దివ్యఖుర్ఆన్-17:85)

దైవప్రవక్త అనుచరుడు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా పొలాల గుండా నడచి వెళ్తున్నాను. దైవప్రవక్త (సల్లం) ఖర్జూరపు కర్ర పట్టుకొని దాని ఊతంతో నడవసాగారు. మేమలా వెళ్తుంటే దారిలో కొందరు యూదులు తారస



పడ్డారు. అప్పుడు వారిలో కొందరు "ఆత్మను గురించి ఆయన్ని అడుగుదాం" అన్నారు. మరికొందరు "వద్దు, మనకు నచ్చని విషయం ఏదైనా ఆయన మనకు విన్పించవచ్చు" అన్నారు. అయితే కొందరు ఆయన్ని ఆత్మను గురించి అడగవలసిందేనని తీర్మానించారు.

దాని ప్రకారం వారిలో ఒకతను వచ్చి "అబుల్ఖాసిం! ఆత్మ అంటే ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) వెంటనే సమాధానం ఇవ్వకుండా క్షణంపాటు మౌనంగా ఉండిపోయారు. దాంతో నేను ఆయనపై దివ్యావిష్కృతి అవతరిస్తోందని భావించి నిలబడ్డాను. దివ్యావిష్కృతి అవతరణ సమయంలో ఆవహించే పరిస్థితి దూరమైన తరువాత ఆయన పైసూక్తి (17:85) పఠించారు. (బుఖారి, ముస్లిం)

ఈ సూక్తిలో కొందరు ఖుర్ఆన్ వ్యాఖ్యానకర్తలు 'ఇక్కడ ఆత్మ అంటే పరిశుద్ధాత్మ' అని భావించారు. అంటే దైవప్రవక్తలకు దైవసందేశం చేరవేసే దైవదూత జిబ్రీల్ (అలైహి) లేక 'దివ్యావిష్కృతి' (Revelation) అన్నమాట. మరికొందరు వ్యాఖ్యానకర్తలు జీవుల్లో ఉండే ప్రాణం అనే అర్థంలో ఆత్మ అంటే జీవాత్మ అని అభిప్రాయపడ్డారు. ఏమైనప్పటికీ ఈ రెండురకాల ఆత్మలు మానవ మేధకు అతీతమైన విషయాలు గనక వీటిని గురించి తలబాదుకోవడం వృధాశ్రమ. అతీంద్రియ విషయాల్ని గురించి ఆరా తీయకుండా వాటిని విశ్వసించడమే బుద్ధిమంతుల లక్షణం.

అతీంద్రియ విషయానికి వస్తే మానవులెవరికీ అంతుబట్టని ఓ అదృశ్యశక్తిని కొందరు తత్వవేత్తలు 'పరమాత్మ' అన్నారు. మరికొందరు 'పరాశక్తి' అన్నారు. ఇంకొందరు 'పరబ్రహ్మ' అన్నారు. దాన్నే సాధారణ భాషలో మనం 'దేవుడు' అంటున్నాము. అంటే యావత్తు సృష్టిరాసుల్లోని ఆత్మలన్నిటికీ అతీతమైన అగోచర శక్తిసంపన్నుడన్న మాట. ఇస్లాం ప్రకారం ఆయనే సకల చరాచరాలకు, వాటి ఆత్మలకు సృష్టికర్త, యజమాని.

"ఆయన మానవ సృష్టిని మన్నుతో ఆరంభించాడు. తరువాత ఒక నీచమైన (వీర్య) బిందువుతో అతని సంతతిని ఉత్పత్తి చేయసాగాడు. ఆపై

అతడ్ని పరిపూర్ణ మానవుడిగా రూపొందించి అతని (శరీరం)లో తన ఆత్మను ఊదాడు." (ఖుర్‌ఆన్-32:9)

## సృష్టివేరు సృష్టికర్త వేరు ✣ జీవాత్మ వేరు పరమాత్మవేరు

ఈ సూక్తిలో మానవుని శరీరంలో దేవుడు తన ఆత్మను ఊదాడంటే, మానవులతో సహా యావత్తు సృష్టిరాసులు, చివరికి మానవుల ఆత్మలు సైతం దేవునివేనని, ఆ ఆత్మలను మానవుల శరీరంలో ఊదాడని అర్థం. విశ్వంలోని సమస్త వస్తువులకు దేవుడే యజమాని. అలాగే ఆత్మలకు కూడా ఆయనే యజమాని. మానవుని దగ్గర తనదంటూ ఏదీ లేదు. అతని ఆత్మ, శరీరం, శక్తి సామర్థ్యాలు అన్నీ దేవుడు ప్రసాదించినవే. ఆయన తలచుకున్నప్పుడు వాటిని తిరిగి తీసుకోగలడు.

అయితే ముస్లిమేతర తత్వవేత్తలు ఈవాస్తవాన్ని విస్మరించి సృష్టికర్త, విశ్వయజమాని అయిన దేవునికి కూడా ఒక ఆత్మ ఉందని, అది కొందరు ప్రత్యేక మానవుల్లో ప్రవేశిస్తుందని, దాంతో వారు దేవుని అవతారమూర్తు లవుతారని అంటారు. ఈ భావనే బహుదైవారాధనకు నాందీవాచకం పలికింది. యావన్మంది మతస్థులు దేవుడు ఒక్కడే అని అంగీకరిస్తారు. అయితే కొందరు ఆచరణలో మాత్రం తాత్విక వలయంలో చిక్కుకొని బహుదైవ భావనను సృష్టించుకున్నారు. ఈ భావంలోనే హిందూమతం లోని అవతార పురుషులంతా ఆరాధ్య దైవాలయ్యారు.

ఈ వేదాంతం ఈసా ప్రవక్త (అలైహి) తదనంతరం క్రైస్తవుల్లోకి కూడా చొచ్చుకొచ్చింది. వారు కూడా దేవుడు ఒక్కడేనని అంగీకరిస్తూనే ఏసుక్రీస్తు కూడా దేవుడని నమ్ముతున్నారు. (వారిలో ఒక వర్గం ఏసుని దైవప్రవక్తగా మాత్రమే నమ్ముతుంది.) ముగ్గురు దేవుళ్ళను విశ్వసించే క్రైస్తవుల్ని గురించి ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది:

"మర్యం కుమారుడు ఈసా మసీహ్ దేవుని ప్రవక్తలలో ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. కాకపోతే ఆయన 'మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ; దేవుని దగ్గరనుండి పంపబడిన ఒక ఆత్మ మాత్రమే.' (ఈ ఆజ్ఞ, ఆత్మలే మర్యం గర్భంలో బిడ్డరూపం సంతరించుకున్నాయి.)"- (4:171)



పైసూక్తిలో ఈసాప్రవక్త (అలై)ను దేవుని ఆజ్ఞతో, ఆయన వైపునుండి పంపబడిన ఆత్మతో పోల్చడం జరిగింది. అయితే క్రైస్తవులు అతిశయానికి పోయి ఈ పదాన్ని దేవుని ఆత్మగా అర్థం తీసుకున్నారు.

"శీలం కాపాడుకున్న స్త్రీ వృత్తాంతం కూడా (వారికి తెలియజెయ్యి). మేమామె (గర్భం)లోకి మా ఆత్మను ఊదాము. ఆమెను, ఆమె కుమారుడ్ని యావత్ ప్రపంచానికి నిదర్శనంగా చేశాం." (21:91)

ఈ సూక్తిలో కూడా 'మా ఆత్మ' అంటే, దేవుడ్ని ఓ భౌతిక రూపంతో పోల్చి జీవరాసులకు మాదిరిగా ఆయనకూ ఒక ఆత్మ ఉందని, ఆ ఆత్మనే మా ఆత్మ అని చెప్పడం జరిగిందని అర్థం ఎంతమాత్రం కాదు. యావత్తు జీవరాసుల ఆత్మలు దేవుని సొత్తే, ఆయన సృష్టే. యావత్తు సృష్టి దేవుని సంపదే. ఆయన తన 'ఆత్మ సంపద' నుండి ఒక ఆత్మను తీసి మర్యం (అలై) గర్భంలోకి పంపాడు. దాన్నే ఇక్కడ 'మా ఆత్మ' అని చెప్పడం జరిగింది. యావత్తు ప్రపంచ స్త్రీల గర్భాలలోకి ప్రవేశపెట్టబడే ఆత్మలన్నీ దేవుని ఆత్మలే. మొత్తం ఆత్మలకు ఆయనే యజమాని.

సృష్టి వేరు, సృష్టికర్త వేరు. జీవాత్మ వేరు, పరమాత్మ వేరు. సృష్టి ఎన్నటికీ సృష్టికర్తతో సంయోగం చెందదు. సృష్టికర్త ఎన్నడూ సృష్టి అవతార మెత్తడు. అలాగే జీవాత్మ వేరు, పరమాత్మ వేరు. జీవాత్మ ఎప్పటికీ పర మాత్మలో విలీనం కాజాలదు. పరమాత్మ ఏనాటికీ జీవాత్మ రూపంలో ఆవిర్భవించడు.

ఏమిటీ, మనం ఇక్కడ ఆత్మకథ గురించి కదా చెప్పుకుంటున్నాం! రండి మన ఆత్మను గురించి ఓసారి ఆత్మావలోకనం చేసుకుందాం.

ఏమైనప్పటికీ పై వివరణను బట్టి మానవుడు ఆత్మను గురించి అర్థం చేసుకోవడం సాధ్యం కాదని స్పష్టంగా తెలుస్తోంది. అయితే

మనస్సు లేక హృదయం, గుండె, మెదడు- ఈ మూడు అవయవాలు మన శరీరంలో మానసిక చర్యల్ని నియంత్రించే ప్రధాన యంత్రాలని చెప్ప వచ్చు. వీటిని నడిపే విద్యుచ్ఛక్తే ఆత్మ. ఆత్మ అనే విద్యుచ్ఛక్తి లేకపోతే ఈ మూడు శారీరక యంత్రాలు మౌనవ్రతం పాటించవలసిందే.

## మ్యాజిక్ మనస్సు

ఈ మూడు అవయవాల చర్యలు రకరకాలుగా ఉంటాయి. భాషను బట్టి కూడా అర్థాల్లో తేడా ఉంటుంది.

**నేనీ పని మనస్ఫూర్తిగా చేశాను :** ఇక్కడ మనస్ఫూర్తిగా లేక హృదయ పూర్వకంగా చేశాను అంటే ఎవరి తరపునా ఎలాంటి బలవంతం, వత్తిడి లేకుండా చేశానని ఒక అర్థం. అలాగే ఎలాంటి స్వార్థం లేకుండా చేశానని కూడా అర్థం ఉండవచ్చు.

మనస్ఫూర్తిగా, హృదయపూర్వకంగా అనే పదాలు చిత్తశుద్ధికి నిలువు టద్దాలు. మనిషిలో చిత్తశుద్ధి లోపిస్తే చేసుకున్న పుణ్యకార్యాలు పాపకార్యా లుగా మారి అతనికి నరకయాతనలు తెచ్చిపెట్టే ప్రమాదం ఉంటుంది. అందుకే "చిత్తశుద్ధి లేని శివపూజ లేలా?".... "చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద" అనే సామెతలు పుట్టుకొచ్చాయి.

మనిషి సత్కార్యాలు ఎలాంటి పరిస్థితిలో చేస్తాడు? ఆ సత్కార్యాలు చిత్తశుద్ధితో ఎప్పుడు చేస్తాడు? ఈ ప్రశ్నలకు అంతిమ దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"(విశ్వాసులారా!) మీలో ఎవరూ తన కోరికలు, ఆకాంక్షలన్నీ నేను తెచ్చిన ధర్మశాస్త్రానికి అనుగుణంగా మారనంతవరకూ (నిజమైన) విశ్వాసి కాలేడు." (మిష్కాత్)

మనిషి మనస్ఫూర్తిగా దైవధర్మాన్ని స్వీకరిస్తే అతనిక తన మనసు, మెదడు, ప్రాణాలతో సహా సమస్తం దైవాభీష్టానికి సమర్పించ వలసి ఉంటుంది. అప్పుడే అతని విశ్వాసానికి దేవుని దగ్గర గుర్తింపు లభిస్తుంది.



**పాషాణ హృదయం :** సాధారణంగా మనం హృదయాన్ని మానసిక (Mental) విషయంగా, గుండెను భౌతిక (Phisical) వస్తువుగా భావిస్తాం. అయితే కొన్ని సందర్భాల్లో భాషాపరంగా ఈ రెండిటిని ఒకే విషయంగా పరిగణిస్తాం. ఉదాహరణకు:- నిర్దాక్షిణ్యానికి, కాఠిన్యానికి పర్యాయపదాలుగా "పాషాణ హృదయం లేక రాతిగుండె" అని చెబుతాం. పాషాణహృదయం గురించి ఖుర్‌ఆన్ ఏం చెబుతుందో చూడండి:

"అయితే అంతటి గొప్ప మహిమ చూసినా మీలో ఎలాంటి మార్పు రాలేదు. పైగా మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమైపోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటి ఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలిపోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి. దేవుడు మీ చేష్టలను గమనించడంలేదని భావించకండి." (2:74)

మన తెలుగు భాషలో మనస్సు అర్థాన్ని వేరే అవయవాలకు ఆపాదించి చెప్పడం కూడా జరుగుతుంది. ఉదాహరణకు ఈక్రింది వాక్యాలు చూడండి.

**వళ్ళు దగ్గర పెట్టుకొని పని చెయ్యి :** ఈ వాక్యంలో వళ్ళు (వడలు) అంటే మనస్సు అనే అర్థం.

**కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా :** ఈ వాక్యంలో కూడా కడుపు (పొట్ట) అంటే మనస్సు అనే అర్థం.

మనవాళ్ళు ఇక్కడ 'ప్రాస' కోసం మనస్సును లేపి మొదటివాక్యంలో వళ్ళును, రెండవవాక్యంలో కడుపును కూర్చోబెట్టి ఉంటారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) (తన అనుచరులకు హితోపదేశం చేస్తూ) "ఇనుముకు నీటి వల్ల తుప్పు పట్టినట్లే హృదయానికి కూడా తుప్పు పట్టు తుంది" అని అన్నారు. (అనుచరులు ఈమాట విని) "అయితే హృదయానికి పట్టే తుప్పు ఎలా వదలుతుంది?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "హృదయానికి పట్టిన తుప్పు పోవాలంటే మృత్యువును

